క్లుప్తంగా

విజయవాడ ఆర్ట్ సొసైటీకి అవార్డ్



విజయవాడ కల్చరల్: ఒంగోలుకు చెందిన సృష్టి ఆర్ట్స్ అకాడమీ సంస్థ చిత్ర కళా రంగానికి చేస్తున్న సేవలను గుర్తించి 2023 సంవత్సరానికి గానూ ఆర్ట్ గెలాక్సీ పురస్కారానికి ఎంపిక చేసినట్లు విజయవాడ ఆర్ట్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి యు.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ గెలాక్సీ సంస్థ ఏటా ఒంగోలులో ఆర్ట్స్ వర్క్ షాప్ నిర్వహించి విశిష్టమైన సేవలను అందించి వారికి అవార్డ్‌ను అందజేస్తుందని తెలిపారు. ఒంగోలులో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అంజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యంతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని, ఆధునిక జీవన శైలి వల్ల మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ప్రతి ఏటా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని డాక్టర్ ఎ.సత్యశ్రీనివాస్ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల్లో భాగంగా హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యాన సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన మహిళలు ఏడాదిలో రెండు సార్లు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్ లక్షణాలు ఇంటి వద్దనే ఏ విధంగా గుర్తించాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్కినేని భావినటులకు మార్గదర్శకం



విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నటజీవితం భావి నటులకు మార్గదర్శకమని సీనియర్ గాయకుడు చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు ముగింపు వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని ప్రారంభదశలో చిన్నపాత్రలు పోషించినా స్వయం కృషి, పట్టుదలతో తెలుగు సినిమా గర్వించే స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు రూపాశ్రీ, విష్ణు ప్రియ, సుధా శ్రీనివాస్, వాసిరెడ్డి శ్రీనివాస్, రసూల్‌బాబు, సత్యవర్ధన్, సుశీల్ కుమార్ అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు.

నేడు వీఎంసీ కౌన్సిల్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాల సంస్థ పాలక పక్షం మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో సభ్యులు ఎజండాలో వచ్చిన అంశాలను చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఎజండాలో మొత్తం 127 అంశాలు, 11 ప్రశ్నలపై సభ్యులు అధికారులు చర్చించి తీర్మానాలు చేయనున్నారు.

ధన్వంతరి జయంతి వేడుకలు



పాయకాపురం(విజయవాడరూరల్): ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో ఈ నెల 10 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు నెల రోజుల పాటు ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. సంస్థలో విద్యార్థులకు, ప్రజలకు ఆయుర్వేదం, ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఔషధ మొక్కలు, ఔషధ ద్రవ్యాల ప్రదర్శన, వివిధ ఆయుర్వేద చికిత్సా పద్ధతులు ప్రదర్శనశాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆరోగ్యకరమైన పదార్థాలతో కూడిన ఫాస్ట్‌ఫుడ్ వంటకాలు అనే ఆహార పోటీలను నిర్వహించారు.

ఆరోగ్యకర సమాజ స్థాపనే లక్ష్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అనారోగ్య సమస్యలతో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని ఆరోగ్యకర సమాజ స్థాపనే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి జగనన్న సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వేల నుంచి మూడు వేల జనాభా లోపువారి నివాస ప్రాంతంలోనే జగనన్న సురక్ష శిబిరం ఏర్పాటు చేసి ఆధునిక వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో సైతం గడప వద్దకే ఆరోగ్య సేవలు అందజేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 28వ డివిజన్ ఇంఛార్జి కనపర్తి కొండలరావు, 31వ డివిజన్ ఇంఛార్జి పెనుమత్స సత్యం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలోని 24వ డివిజన్ 91వ వార్డు సచివాలయం పరిధిలో సూర్యారావుపేటలోని కర్నాటి రామ్మోహనరావు స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి క్యాంపులోనూ 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అవసరం మేరకు కంటి పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు చేయడంతో పాటు మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నట్లు వివరించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోనే 71,982 కుటుంబాలకు గత నాలుగేళ్లలో రూ.160 కోట్లు ఆరోగ్యశ్రీ సేవలు అందించినట్లు వెల్లడించారు. అలాగే పేదలకు మెరుగైన వైద్య సేవల కోసం కొత్తగా నాలుగు యూపీహెచ్‌సీలు నిర్మించామని, మరో యూపీహెచ్‌సీ నిర్మాణం దిశగా ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కుక్కల రమేష్‌తో పాటు స్పెషలిస్టు వైద్యులు పాల్గొన్నారు.



శ్రీనగర్ కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు



గవర్నర్‌పేట మున్సిపల్ స్కూల్‌లో హెల్త్ ప్రొఫైల్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది

689 మందికి వైద్య పరీక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అరండల్‌పేట 25వ డివిజన్‌లోని 96వ వార్డు సచివాలయం, 23వ డివిజన్ గవర్నర్‌పేట మున్సిపల్ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 689 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారికి మల్లాది విష్ణు హెల్త్ ప్రొఫైల్ అందజేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, 25వ డివిజన్ కార్పొరేటర్ బంకా శకుంతల, 23వ డివిజన్ ఇంచార్జి ఆత్మకూరు సుబ్బారావు, డివిజన్ కోఆర్డినేటర్ ఒగ్గు విక్కీ, నాయకులు వెన్నం రత్నారావు, చల్లా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా..స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫిట్ ఇండియా స్వచ్ఛతా 4.0 రన్‌లో భాగంగా విజయవాడ కెనరా బ్యాంక్ సర్కిల్ ఆధ్వర్యాన ఫిట్ ఇండియా.. స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్ సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ రవివర్మ పాల్గొని స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని అన్నారు. ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతులుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నేటి జీవన శైలిలో ప్రతి ఒక్కరు ఎన్నో ఒడిదులుకులతో అనారోగ్య సమస్యలకు గురవుతూ రోగాల పాలవుతున్నారని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని ప్రతీ ఒక్కరు పాటించి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఏదో ఒక రకమైన వ్యాయామాన్ని ప్రతి రోజూ అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ మేనేజర్ రామారావు, బ్యాంకు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫిట్ ఇండియా.. స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్

రేపు సంకట హరచతుర్థి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్య నగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం సంకట హరచతుర్థి పురస్కరించుకుని శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయ గణపతికి లోక కళ్యాణార్థం రుద్రాభిషేకం, అర్చనలు బుధవారం సాయంత్రం జరుగుతాయన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాల్సిందిగా వరప్రసాద్ కోరారు.

6 నుంచి శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో నవంబర్ 6వ తేదీ నుంచి ఎం.ఎస్ ఆఫీస్ కొత్త బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నమని ఎం.బి.విజ్ఞాన కేంద్రం శిక్షణా విభాగం బాధ్యుడు టి.క్రాంతికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సహకారంతో జరుగుతున్న ఈ శిక్షణ తరగతులు రెండు నెలల పాటు ప్రతి రోజు రెండు గంటలు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు నవంబర్ 4వ తేదీలోగా 0866 2578044, 94900 98042 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

శరవేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు

గుణదల(విజయవాడ తూర్పు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యాన సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్ ఒకటో వార్డు సచివాయలం పరిధిలోని సంగం రోడ్డు ఫ్లైఓవర్ నుంచి ఎస్ఎల్‌వీ గ్రాండ్ వరకు కార్పొరేటర్ ఉద్దండి సునీతతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విష్ణు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ శివారు కాలనీల్లోని చిట్టచివరి ఇంటి వరకు మౌలిక వసతులు కల్పించాలనే ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దేవీనగర్ నుంచి ఈ ప్రాంతం వరకు యూజీడీ, తాగునీటి వ్యవస్థలను మెరుగుపరుస్తున్నట్లు వెల్లడించారు. సంగం రోడ్డు ఫ్లైఓవర్ ప్రాంత వాసులకు ఖచ్చితంగా కృష్ణా జలాలను అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ పరిసర ప్రాంతాల్లో నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మిస్తామని పేర్కొన్నారు.

హైటెక్ సిటీని తెచ్చింది నేదురుమల్లి:

హైటెక్ సిటీని తీసుకొచ్చింది అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అని ఎమ్మెల్యే విష్ణు తేల్చి చెప్పారు. నేదురుమల్లి హైటెక్ సిటీని ప్రారంభిస్తే ఆ తర్వాత చంద్రబాబు చుట్టూ ఉన్న భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని ఆరోపించారు. గచ్చిబౌలిలో జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకలు ఓ నాటకమని పేర్కొన్నారు. చంద్రబాబును మించి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, అల్ల ప్రసాద్‌రెడ్డి, ఉద్దండి సురేష్, బండి వేణు, మండాది వెంకట్రావు, పావని, అనంతలక్ష్మీ, నాగరాజు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది

పోలీస్ స్పందనలో 89 ఫిర్యాదులు

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 89 ఫిర్యాదులు నమోదయ్యాయి. కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు రూరల్ డీసీపీ అజిత వేజెండ్ల స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల నుంచి వివిధ సమస్యలు, వినతులు స్వీకరించారు. నేరుగా బాధితులతో మాట్లాడారు. అదే విధంగా దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశాలు జారీ చేశారు. నగదు లావాదేవీలకు సంబంధించినవి 28 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలపై 14, సివిల్ వివాదాలు 15, వివిధ మోసాలపై 10, ఇంటి అద్దె సమస్యలపై 3, చోరీలపై 2 ఫిర్యాదులు, ఇతర చిన్న చిన్న వివాదాలపై 17 మొత్తం 89 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.



స్పందనలో బాధితుల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న డీసీపీ అజిత వేజెండ్ల

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు సోమవారం 3వ ట్రాఫిక్ పోలీసులు 7 కేసుల్లో మద్యం తాగి వాహనములు నడిపే చోదకులను అరెస్టు చేసి ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్‌లో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి వారికి జైలు, జరిమానా విధించారు. వారిలో ఒక వ్యక్తికి 10 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, ఒక వ్యక్తికి 07 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, ఒక వ్యక్తికి 02 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, మిగిలిన నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధించారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి మరువలేనిది

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశాన్ని ఏక తాటిపై ఉంచేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని ఆయన జీవన విధానం, నమ్మిన సిద్ధాంతాలు ఆచరణీయమని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ డాక్టర్ ఎస్.విద్యా కన్నా, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన జాతీయ ఐక్యత దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ జయంతిని స్మరించుకుని నిర్వహించేదే జాతీయ ఐక్యత దినోత్సవమని అన్నారు. దేశం పటిష్టంగా ఐక్యంగా నిలబడిందంటే పటేల్ కృషి కారణమని ఆయన స్ఫూర్తితో విద్యార్థులు పని చేయాలని సూచించారు. అనంతరం కళాశాల సిబ్బంది, జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, విద్యార్థులు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల నుంచి చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్ వరకు ఏక్తా దివస్ ర్యాలీ నిర్వహించారు.



ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఏక్తా దివస్ ర్యాలీ


వెహికల్ డిపో ఇన్‌స్పెక్టర్ మాచర్ల డేవిడ్‌రాజు మృతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరపాలక సంస్థ వెహికల్ డిపోలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మాచర్ల డేవిడ్ రాజు(39) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. డేవిడ్‌రాజు మరణవార్తను తెలుసుకున్న కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని వారి స్వగృహానికి సోమవారం విచ్చేసి డేవిడ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరిపై ఉంటుందని, దేశాన్ని సంరక్షించే అవకాశం లభించడం మన జీవితానికి గొప్ప వరమని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ అన్నారు. సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మధు డిఫెన్స్ అకాడమీ కార్యాలయాన్ని వడ్డీల కార్పొరేషన్ చైర్మన్ సైదు సంతోషి గాయత్రి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఫిలదెల్ఫియా ఏజీ చర్చ్ పాస్టర్ రెవ.చాల్స్ పి.జాకబ్‌లతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ దేశ రక్షణకు మన రక్షణ శాఖ చేస్తున్న సేవలు అత్యంత విలువైనవన్నారు. రక్షణశాఖలో పనిచేసే ప్రతి సైనికుడు దేశం కోసం తమ సర్వాన్ని అర్పించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. అనంతరం నారాయణ ముదిరాజ్ దంపతులను సన్మానించారు. ఏపీ ముదిరాజ్ మహాసభ నాయకులు వల్లిబోయిన రాజు, కోలా ఏడుకొండలు, వెలిబోయిన రమేష్, సాంబశివరావు, దుప్పుల శివాజీ, ఉండు కళ్యాణ్, శివ తదితరులు పాల్గొన్నారు.



నారాయణ ముదిరాజ్ దంపతులను సన్మానిస్తున్న అకాడమీ నిర్వాహకులు

సంతృప్తికర పరిష్కారాలే లక్ష్యం

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న స్పందనలో పరిష్కారాలు లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు దారులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని సూచించారు. సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందనలో మొత్తం 25 సమస్యలపై ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగం-9, ఇంజినీరింగ్ విభాగం-9, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)-4, రెవెన్యూ-1, ఎస్టేట్ విభాగం-1, ఇతర -1 కు సంబంధించి అందుకున్న సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, అదనపు కమిషనర్ (జనరల్), పట్టణ సాధికారాభివృద్ధి అధికారి శకుంతల, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మీ, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, సీఈ ప్రభాకర్, సీఎంవోహెచ్ డాక్టర్ రత్నావళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): డివిజన్ వ్యాప్తంగా సోమవారం నుంచి నవంబర్ 5 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విధుల్లో పారదర్శకత, అవినీతి రహిత సేవలు అందిస్తామంటు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు అవినీతి రహిత భారతదేశం కోసం కృషి చేయాలని, విధుల్లో సమగ్రతతో పారదర్శకత ఉండేలా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఈ నెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని యునిటీ రన్, సెమినార్‌లు, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్, పలు బ్రాంచ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

కుందావారి కండ్రికలో హైమాస్ట్ వెలుగులు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ప్రతీ గ్రామం కాంతివంతంగా మారిందని వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. 64వ డివిజన్ కుందావారి కండ్రికలో రూ 3.52 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జాయింట్ కలెక్టర్ సంపత్, కెడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ తాతానేని పద్మావతి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి సోమవారం మంత్రి ప్రారంభించారు. గత ప్రభుత్వంలో రాత్రి వేళల్లో గ్రామాల్లో తిరగాలంటే చిమ్మ చీకట్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయంతో ప్రయాణం చేయాల్సి వచ్చేదని మంత్రి గోవర్ధన్‌రెడ్డి గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటువంటి పరిస్థితి లేదని, పల్లె పల్లెకు విద్యుత్ కాంతులు ప్రసరిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



కండ్రికలో హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే విష్ణు

స్మృతివనం పనులు పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. స్మృతి వనం పనుల కోసం వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో నిరంతరం పనులను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతివనం నిర్మాణ డిజైన్ల ఆధారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచామని తెలిపారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. గ్రానైట్, ఫుట్ పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. పార్కింగ్ ఏరియా సిద్ధం చేస్తున్నామని, ఈ ప్రాంగణంలో అందమైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



స్మృతివనం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్